## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఈజ్ ఆఫ్ జస్టిస్ వ్యవస్థతోనే సత్వర న్యాయం అందుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు.
- రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఉపాధ్యాయుల నియామక ఉత్తర్వులు జారీ చేయనుందని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.
- ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.
- వాయువ్య మధ్య ప్రదేశ్, తూర్పు రాజస్థాన్, దిఘా మీదుగా అల్పపీడన ద్రోణి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

===================

ఈజ్ ఆఫ్ జస్టిస్ వ్యవస్థతోనే సత్వర న్యాయం అందుతుందని, ఈ వ్యవస్థలో మీడియేషన్, ఆర్బిట్రేషన్ ప్రక్రియలు ముఖ్య భూమిక పోషిస్తాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఈరోజు విశాఖపట్టణంలో జరిగిన అంతర్జాతీయ మీడియేషన్ కాన్ఫరెన్సులో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ ద్వారా న్యాయం అందరికీ అందుబాటులోకి రావడంతో పాటు వేగంగా, సమర్ధవంతంగా చేరుతుందన్నారు. విశాఖలో ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ ఎకో సిస్టం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. దేశం అమలు చేస్తున్న సంస్కరణలు, కొత్త వ్యవస్థలు అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో వివాదాలు తగ్గించుకోవటమే ఆర్థిక వ్యవస్థకు కీలకమని ముఖ్యమంత్రి వివరిస్తూ..

(వాయిస్ బైట్...40 సెకన్లు)

===================

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఉపాధ్యాయుల నియామక ఉత్తర్వులు జారీ చేయనుందని హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఈరోజు అనకాపల్లిలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి గురుపూజోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురువులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు సమాజంలో గౌరవం ఇవ్వాలన్నారు. చిన్నపిల్లలు దురలవాట్లకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సెల్ ఫోన్ వినియోగించడం వలన కొంతమంది విద్యార్థులు చదువుల్లో రాణించలేకపోతున్నారని వీరిపై తల్లితండ్రులు, ఉపాధ్యాయులు దృష్టి సారించాలని తెలిపారు.

===================

రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు సహకారం అందించాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రధానమంత్రి నరేంద్రమోదీని కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన ఈరోజు ప్రధానమంత్రితో మర్యాద పూర్వకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లో సెమీ కండక్టర్ యూనిట్ మంజూరు చేసినందుకు నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఐటి, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల స్థాపనకు చేయూత అందించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యాప్రమాణాల మెరుగుదలకు రాష్ట్ర విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలు చేస్తున్నామని, ఉన్నత విద్యలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం, మార్గదర్శనం కావాలని కోరారు. జీఎస్టీ సంస్కరణల ద్వారా దేశంలో కోట్లాది పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కలిగించినందుకు, అలాగే రాష్ట్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందిస్తున్న ప్రధానమంత్రికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో గత కొంతకాలంగా నెలకొన్న వివిధ పరిణామాలను మంత్రి లోకేష్ వివరించగా, ప్రధానమంత్రి స్పందిస్తూ... రాష్ట్రాభివృద్ధికి అన్నివిధాలా సహకారం అందిస్తామని తెలిపారు. యోగాంధ్ర నిర్వహణపై రూపొందించిన కాఫీ టేబుల్ బుక్ ను ఈ సందర్భంగా ప్రధానమంత్రికి, లోకేష్ బహుకరించారు.

===================

మహమ్మద్ ప్రవక్త జన్మదినానికి గుర్తుగా నిర్వహించుకునే "మిలాద్ ఉన్ నబీ" పండుగ ముస్లిం సోదరుల జీవితాల్లో వెలుగులు నింపాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆకాంక్షించారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా సామాజిక మాధ్యమం వేదికగా ఆయన ముస్లిం సోదరులకు, శుభాకాంక్షలు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త మానవాళికి ప్రేమ, శాంతి, ఐక్యత, సోదరభావం, ధర్మబద్ధ జీవనాన్ని ప్రబోధించారని మంత్రి పేర్కొన్నారు.

===================

విరామం

===================

ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు.

ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ భీమవరంలోని తన నివాసం వద్ద నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకల్లో పాల్గొని పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు.

ఉపాధ్యాయులు పాఠాలతో పాటు విద్యార్థులకు నైతిక విలువలను కూడా బోధించాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పార్వతీపురంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమాజంలో గౌరవ ప్రదమైనవారని, వారిని సన్మానించుకోవడం మనందరి బాధ్యతని విజయనగరం జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అన్నారు.

భారతీయ సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎంతో ప్రాముఖ్యత ఉందని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు.

===================

జీఎస్టీ పన్నుల సంస్కరణలతో పౌల్ట్రీ పరిశ్రమలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని విజయనగరం జిల్లా పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ టి. దామోదర్ నాయుడు తెలిపారు. ఈరోజు విజయనగరంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జీఎస్టీని పాల ఉత్పత్తుల్లో జీరో స్థాయికి తగ్గించడం, అదేవిధంగా పశువుల దాణా, వ్యవసాయ యాంత్రీకరణపై ఐదు శాతం స్లాబ్ కి తగ్గించటం వల్ల ఈ పౌల్ట్రీ పరిశ్రమలు మరింత వృద్ధిని సాధిస్తాయన్నారు. సుమారు 25 లక్షల కుటుంబాలకు పశుసంవర్ధన రంగం జీవనోపాధి కల్పిస్తోందన్నారు. మన రాష్ట్రం దేశంలో గేదెల సంఖ్యలో 6వ స్థానంలో, గొర్రెల సంఖ్యలో 2వ స్థానంలో, కోళ్ళ సంఖ్యలో 2వ స్థానంలోనూ ఉందన్నారు. అలాగే గ్రుడ్ల ఉత్పత్తిలో మొదటి స్థానంలో, మాంస ఉత్పత్తిలో 4వ స్థానంలో, పాల ఉత్పత్తిలో 5వ స్థానంలో ఉందన్నారు. రాష్ట్ర స్థూల వార్షిక ఉత్పత్తిలో 12.17% వాటాతో 1.61లక్షల కోట్ల రూపాయలు పాడి పరిశ్రమ నుంచే లభిస్తోందన్నారు.

===================

రాష్ట్రంలో యూరియా సరఫరా సమస్యలపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. యూరియా నిల్వలు, పంపిణీ, సరఫరాలపై జిల్లా కలెక్టర్లతో మంత్రి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి జరిగిన ఈ సమావేశంలో కృష్ణా, ఎన్టీఆర్, శ్రీకాకుళం, బాపట్ల, విజయనగరం, కడప, ఏలూరు, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భవిష్యత్ అవసరాల కోసం రబీ సీజన్ కు 9.5 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు ఇప్పటికే రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. యూరియా నిల్వలు ఎక్కువగా ఉన్నటువంటి ప్రాంతాల నుండి డిమాండ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు సరఫరా చేసే విధంగా కలెక్టర్లు చర్యలు చేపట్టాలన్నారు. గంగవరం, కాకినాడ పోర్టుల నుండి రాష్ట్రానికి రావలసిన 53 వేల మెట్రిక్ టన్నుల యూరియా సకాలంలో రాష్ట్రానికి చేరుకునే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని మంత్రి తెలిపారు.

===================

వాయువ్య మధ్య ప్రదేశ్, తూర్పు రాజస్థాన్, దిఘా మీదుగా అల్పపీడన ద్రోణి కొనసాగుతోందని, ఇది ఆగ్నేయ తూర్పు మధ్య బంగాళాఖాతం వైపు పయనిస్తూ.. సముద్రమట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తువరకు విస్తరించి ఉందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్ర తెలిపింది. ఆంధ్రప్రదేశ్, యానంలలో దిగువట్రోపో ఆవరణ నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయని వాతావరణ అధికారి ఎల్ నారాయణ వివరిస్తూ..

(వాయిస్ బైట్...30 సెకన్లు)

===================

ప్రకృతి సిద్ధమైన పద్ధతుల్లో సాగుచేసిన పంటలతో తయారయ్యే సేంద్రియ ఉత్పత్తులే ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందిస్తాయని శ్రీకాకుళం జిల్లా శాసనసభ్యులు గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళంలోని రైతుబజారు వద్ద డ్వాక్రా మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటైన మూడు సేంద్రియ ఉత్పత్తుల మొబైల్ వాహనాలను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రసాయన ఎరువులు, పురుగుమందులు వాడకుండా  కంపోస్టు, పచ్చిరొట్ట వంటి జీవ ఆధారిత ఎరువులతో పండించే పంటలతో వచ్చే ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేస్తాయని వివరించారు.

===================

===================